క్లుప్తంగా

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



మైలవరం: విద్యార్థులు తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పూర్తి సదుపాయాలు, ర్యాంకింగ్స్ ఉన్న కళాశాలలను ఎంపిక చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించిన మాక్ టెస్ట్ ఈఏపీసెట్ (ఎంటీఈఏ–2025)లో ప్రతిభ చూపిన మొదటి 27 మంది విద్యార్థులకు రూ.5,30,000 నగదు బహుమతులు, సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా ఉంటూ వాళ్ళు సాధించాలనుకున్న విషయాల్లో అండగా ఉండాలన్నారు. డాక్టర్ డి. వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జల వనరుల గణనలో శిక్షణ



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): భూగర్భ జలాల స్థితిగతులపై డైరెక్టర్ ఎకానమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆధ్వర్యంలో చిన్న తరహా నీటి వనరుల గణన శిక్షణ కార్యక్రమం శుక్రవారం కొత్తూరు తాడేపల్లి గ్రామ శివారు వేమవరంలో జరిగింది. ఈ సందర్భంగా చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్, చెక్‌డ్యామ్‌లు, బోర్ల కింద సాగయ్యే భూముల వివరాలను నమోదు చేస్తున్నారు. 2023–24వ సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో శిక్షణ ఇస్తున్నామని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం మొబైల్‌లోయాప్‌ను డౌన్‌లోడ్ చేసి స్థానికంగా ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో చిన్న తరహా నీటి వనరుల గణన వివరాలను వీఆర్వోలు నమోదు చేస్తారని చెప్పారు. వేమవరం చెరువు ఆయకట్టు 300 ఎకరాలు ఉందని వీఆర్వో చక్రధరరావు తెలిపారు. డెప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌కుమార్, ఏఎస్‌ఓలు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణ చేపట్టాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని అఖిల పక్ష పార్టీల నాయకులు కోరారు. ఈ మేరకు కొండపల్లి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ మాట్లాడుతూ పూర్వం 60 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉండేదన్నారు. కాలానుగుణంగా ఆక్రమణలతో కుంచించుకుపోయి ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లడం కష్టంగా మారిందని వివరించారు. కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి, ఎన్టీటీపీఎస్ కాలుష్యం నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన రోడ్డు సర్వే చేయించి రోడ్డు విస్తరణ అవకాశాలు పరిశీలిస్తామన్నారు. కొండపల్లిలో ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముళ్లపొదలతో రైతుల ఇబ్బందులు



చాట్రాయి: ముళ్ల చెట్లతో అడవిని తలిపిస్తున్న చెరువు కట్టతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చనుబండ పెద్ద చెరువు కట్టకు ఇరువైపులా ముళ్ల చెట్లు కట్టమీదకు రావడంతో వ్యవసాయ పనుల నిమిత్తం ఎదురుగా వస్తున్న ప్రజలు ట్రాక్టర్లు తప్పుకోలేని పరిస్థితి నెలకొంది. కట్టమీద రాకపోకలకు ముళ్ల పొదలు ఇబ్బందికరంగా మారాయని, ఇరిగేషన్ అధికారులు స్పందించి కట్ట మీద ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

12న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరువూరు: డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 12న తిరువూరులో జరుగుతుందని ఆర్డీఓ మాధురి తెలిపారు. ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఏడాదిగా అంధకారంలోనే!

- 30వ నంబర్ జాతీయ రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు
- నిత్యం రద్దీగా ఉండే రహదారిపై చీకట్లు కమ్ముకొని ప్రమాదాలు
- రాకపోకలకు వాహన చోదకుల నరకయాతన



జి.కొండూరు వద్ద జాతీయ రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు



గొల్లపూడి వద్ద జాతీయ రహదారిపై వెలగని విద్యుత్ దీపాలు

జి.కొండూరు: ఇది లోకల్ హైవే అనుకుంటిరా నేషనల్ హైవే. మా ఇష్టం వచ్చినట్లు మెయిన్‌టెయిన్ చేస్తాం. మమ్మల్ని అడిగే స్థాయి ఎవరికుంది అన్నట్లు వ్యవహరిస్తున్నారు నేషనల్ హైవే అధికారులు. హైవే నిర్వహణను గాలికొదిలేయడంతో విద్యుత్ దీపాలు వెలగక నేషనల్ హైవే కాస్తా డార్క్ హైవేగా మారి వాహన చోదకులకు చుక్కలు చూపిస్తోంది. ఈ పరిస్థితి ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు పది కిలోమీటర్ల మేర గత ఏడాదిగా నెలకొంది.

నిత్యం రద్దీగా హైవే

30వ నంబర్ ఛత్తీస్‌గడ్ జాతీయ రహదారి ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లి, శాంతినగర్, కట్టుబడిపాలెం, విద్యానగరం మీదుగా జి.కొండూరు వరకు పది కిలోమీటర్ల మేర నిత్యం రద్దీగా ఉంటోంది. కొండపల్లి ఐడీఏలో వందలాది పరిశ్రమలు, రహదారికి సమీపంలో క్రషర్లు, క్వారీలు ఉండడంతో నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ఈ రహదారిని 2017లో విస్తరణ చేసిన సమయంలో ఈ పది కిలోమీటర్ల మేర నాలుగు వరసల రహదారికి మధ్యలో డివైడర్ నిర్మాణంతో పాటు భారీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కొంతకాలం మాత్రమే ఈ దీపాలు పని చేశాయి. గత ఏడాదిగా ఒకటి, రెండు మినహా ఈ విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రహదారి మొత్తం చీకట్లు కమ్ముకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితో పాటు ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడి వరకు విజయవాడ–హైదరాబాద్ హైవేలో సైతం ఎనిమిది కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలు వెలగక వాహన చోదకులు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు.

రహదారి అస్తవ్యస్తం

ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు పది కిలోమీటర్ల మేర నిర్వహణ సరిగా లేక జాతీయ రహదారి అస్తవ్యస్తంగా మారింది. భారీ వాహనాలలో కంకర, డస్టు ఓవర్‌లోడుతో రవాణా చేయడం వల్ల బ్రేకులు వేసిన సమయంలో కంకర, డస్టు జారి రహదారిపై పడుతోంది. డస్టు, కంకర మార్జిన్లలోకి చేరుతోంది. జాతీయ రహదారి అధికారులు ఈ వ్యర్థాలను అలానే వదిలివేయడంతో రాత్రి వేళల్లో వెలుగు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మధ్యలో డివైడర్‌పై రక్షణగా ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగ్‌లు సైతం విరిగిపోవడంతో పాదచారులు ఇష్టం వచ్చినట్లు రహదారి దాటుతూ రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. నేషనల్ హైవే సమస్య కావడంతో స్థానిక అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నాకు జి.కొండూరులో వెల్డింగ్ షాపు ఉంది. సామాన్ల కోసం బైకుపై ప్రతి రోజూ విజయవాడ వెళ్లి వస్తుంటా. రాత్రి సమయాల్లో సామాన్లతో బైకుపై వస్తున్నప్పుడు హైవేపై లైట్లు వెలగకపోవడంతో నరకయాతన పడుతున్నా. అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– చిలకలపూడి బాలకృష్ణ, వెల్డింగ్ షాపు యజమాని, జి.కొండూరు

అధికారులు స్పందించాలి



ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు జాతీయ రహదారి పల్లెటూరిలో రహదారిలా మారింది. లైట్లు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకొని వాహనాలను క్రాస్ చేసే సమయంలో మార్జిన్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– పజ్జూరు కిశోర్, గ్రామస్తుడు, కొండూరు

కట్టెలేరుపై వంతెన నిర్మించాలని వినతి

తిరువూరు: వినగడప వద్ద కట్టేలేరుపై హై లెవెల్ వంతెన నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం గంపలగూడెం మండల నాయకులు విజ్ఞప్తి చేశారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సీపీఎం గంపలగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. 2018 ఆగస్టు నెలలో వచ్చిన అధిక వర్షాలు, వరదలకు వినగడప వద్ద కట్టలేరు బ్రిడ్జి కూలిపోయి, గంపలగూడెం – చీమలపాడు మార్గంలో వర్షాలు వచ్చిన ప్రతిసారి రాకపోకలు స్తంభించి మండలంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మీసాల గోపి, మల్లవరపు కుటుంబరావు, మీసాల గోపాలరావు, చిన్నబాబు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్ సీఈగా శివ రామాంజనేయులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా పి.శివ రామాంజనేయులు నియమితులయ్యారు. విజయవాడ విద్యుత్ సౌధలో ఎస్ఈ క్యాడర్‌లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్న ఆయనను ప్రమోషన్‌పై చీఫ్ ఇంజినీర్‌గా ఇక్కడికి బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఈగా విధులు నిర్వహించిన టి.నాగరాజును హైడల్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్స్ (హెచ్‌పీసీ) చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధరబాబు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీటీపీఎస్ పరిపాలనా భవనంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన నూతన సీఈని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. యూనియన్ నేతలు మణిబాబు, సత్యప్రసాద్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల గోడు పట్టని ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న స్వామిదాసు

తిరువూరు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వేతనాలివ్వక, అరకొర వేతనాలు సైతం సకాలంలో చెల్లించక వారిపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరు మండలం కోకిలంపాడులో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో 10 కోట్ల 70 లక్షల పని దినాలు కల్పించిందన్నారు. ఈ ప్రభుత్వం 2 కోట్ల 69 లక్షల పని దినాలను తగ్గించిందని చెప్పారు. కూలీలు ఆరు రోజులు పనిచేస్తే మూడు రోజులు మాత్రమే మస్టర్ వేస్తున్నారని, పేదలు కష్టపడి పనిచేస్తే నెలల తరబడి కూలి నగదు అందడం లేదన్నారు. ఉపాధి కూలీలకు కనీసం పని ప్రదేశం లో టెంట్, మజ్జిగ, ఓఆర్ఎస్, మంచినీరు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదని చెప్పారు. రాజకీయాలకు తావు లేకుండా ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించాలని, అనుభవం లేని ఫీల్డ్ అసిస్టెంట్ల వలన నష్టం జరుగుతున్నందున పర్యవేక్షణ లోపాలు సరిదిద్దాలని, ఉపాధి హామీని సక్రమంగా అమలు చేయాలని, వారానికి ఆరు రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశీ రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూమే ఆధారం.. ల్యాండ్ పూలింగ్‌కు ఇవ్వలేం

గ్రామసభల్లో తేల్చిచెప్పిన కేతనకొండ, కాచవరం రైతులు



కాచవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ చైతన్య, పక్కన తహసీల్దార్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం: మేమంతా అరెకరం, ఎకరం భూమి కలిగిన సన్నచిన్నకారు రైతులం. ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వానికి మా భూములు ఇవ్వలేమని ఆర్డీఓ కావూరి చైతన్యకు రైతులు తెలిపారు. రాజధాని అవసరాల నిమిత్తం ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకునేందుకు కేతనకొండ, కాచవరం గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆలోచన చేయాలన్నారు. రాజధాని ప్రాంతంతో పాటు మీ ప్రాంతం కూడా స్పోర్ట్స్ క్లబ్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, పర్యాటకంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎకరా భూమి ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుంటే సీఆర్డీఏ పరిధిలో 1,250 గజాల నివాసం, కమర్షియల్ స్థలం కేటాయించే అవకాశం ఉందని చెప్పారు. రాజధానిలో కౌలు ఆనాడు రూ.30 వేలతో ప్రారంభమై ఏడాదికి 10 శాతం చొప్పున పెరిగిందన్నారు. నిర్మాణం పూర్తయ్యే వరకు ఇక్కడ కూడా కౌలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అప్పటి ప్యాకేజీ ఇప్పుడు ఇస్తామంటే కుదరదు..

కాచవరం గ్రామ సర్పంచి డి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2015లో రాజధాని అమరావతిలో ఎకరా ధర రూ.20 లక్షలు ఉందన్నారు. అప్పటి ప్యాకేజీ ఇప్పుడు ఇక్కడ ఇస్తామంటే కుదరదన్నాడు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మా ప్రాంతంలో ఎకరా రూ.కోటి నుంచి రూ.2 కోట్లు ధర ఉందన్నారు. ఈ లెక్కన ఇక్కడ ఏవిధమైన ప్యాకేజీ ఇస్తారో చెప్పాలని రైతుల తరఫున కోరారు.

భూములిస్తే మా అవసరాలు ఎలా తీరతాయి..

రైతులు మాట్లాడుతూ మీరిచ్చే ప్లాటు అభివృద్ధి చెందటానికి మరో పదేళ్లు పడుతుందన్నారు. భూములిస్తే ఈలోగా మా పిల్లల చదువులు, వివాహాలకు అవసరమైన నగదు భూమి తాకట్టు పెట్టి తెచ్చుకునే అవకాశం ఉండదని చెప్పారు. ఇప్పుడు మీకు భూములు ఇస్తే మా అవసరాలు ఎలా తీరతాయని ప్రశ్నించారు. రెండు గ్రామాల్లోనూ పూలింగ్‌లో భూములు ఇవ్వమని రైతులు తేల్చిచెప్పారు. గ్రామసభల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రామాల సర్పంచులు రాజేంద్రప్రసాద్, నళినీ ఆశాలత, ఎంపీటీసీలు రంగస్వామి, సువర్ణ రాజు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను జూన్‌లోగా పూర్తి చేయాలి



గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలో పేదలకు గతంలో మంజూరైన గృహాల నిర్మాణ పనులను జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటిని మంజూరు చేస్తామన్నారు. వేసవి సమయం నిర్మాణ పనులకు అనుకూలమైందని, ప్రారంభించిన ఇళ్లను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్ల కోసం భూమి మంజూరు చేసి, ఇంకా భూమిని స్వాధీనం చేయని లబ్ధిదారులకు కొత్త నిబంధనల ప్రకారం 3 సెంట్లను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, హౌసింగ్ అర్బన్ ఎస్ఈ ఎం.కృష్ణయ్య, గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి డైమండ్స్ అపార్ట్‌మెంట్, టీటీడీసీ ఆఫీస్, హైసూకల్, సీ అండ్ టీ టవర్స్, బాలాజీ టవర్స్, మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్, మహేంద్ర నగర్, టెలికాం నగర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- **మైలవరం:** మైలవరం మండలం వెల్వడం, గణపవరం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గణపవరం ఏఈ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. నెలవారీ మరమ్మతుల నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

పెంచిన విద్యుత్ చార్జీలపై నిరసన



తిరువూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తిరువూరు: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తిరువూరు బోసు బొమ్మ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు ప్రజలపై ఎలాంటి భారాలు మోపబోమని హామీలిచ్చిందని, ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇంటింటికీస్మార్ట్ మీటర్లు బిగించడం, కరెంటు చార్జీలు ఇబ్బడి ముప్పడిగా పెంచడం సిగ్గుచేటని సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌వీ భద్రం విమర్శించారు. ఇప్పటికే ప్రజలు నిత్యావసర సరుకులు, డీజిల్, పెట్రోలు ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే, మళ్లీ కరెంటు చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని, ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగు రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, ఆకుల రవి, బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలలైనా పూడ్చని పెద్ద చెరువు గండ్లు

నూజివీడు: గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పెద్ద చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడ్డాయని, వాటిని ఇంతవరకు పూడ్చలేదని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి. రాజు శుక్రవారం ధ్వజమెత్తారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద చెరువుకు పడిన గండ్లను ఎనిమిది నెలలు కావస్తున్నా పూడ్చకపోవడంతో రానున్న వర్షాకాలంలో చెరువులో నీరు ఉండదన్నారు. గండ్లు పూడ్చేందుకు దాదాపు కోటి రూపాయలు మంజూరైనట్లు పాలకులు, అధికార పార్టీ నాయకులు చెబుతున్నారని, ఇంతవరకు పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. గండ్లు పూడ్చకపోవడం వల్ల ఇటీవల కురిసిన చిన్నపాటి జల్లులకు సైతం వరద మాదిరిగా రోడ్లపై నీళ్లు ప్రవహించిందన్నారు.

నాసిరకంగా రోడ్ల నిర్మాణం

మండలంలోని కొన్నంగుంటలో రూ.కోటితో 5 వందల మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు, పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో రూ.80 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు నెల రోజులకే దెబ్బతినడం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన రోడ్డును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ నాణ్యతకు తిలోదకాలిచ్చి రోడ్లు నిర్మించారని, పర్యవేక్షించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. నాసిరకం రోడ్లను నిర్మించిన సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

పుట్రేల(విస్సన్నపేట): తీసుకున్న నగదు తిరిగి ఇవ్వకపోవడం, ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని పుట్రేల గ్రామం యాదవుల బజార్‌కి చెందిన వెల్లంకి నవీన్ (24) ఉద్యోగం కోసం ఓ వ్యక్తికి కొంత నగదు ఇచ్చాడు. అతను ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న నగదును తిరిగి ఇవ్వలేదు. ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తున్నాడు. దీనితో మనస్తాపం చెందిన నవీన్ శుక్రవారం ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీల్లో కిశోర వికాసం

ఇబ్రహీంపట్నం: కిశోర వికాసం 2.0 కార్యక్రమం మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శుక్రవారం జరిగింది. మైలవరం ఐసీడీఎస్ సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ యుక్త వయస్సు బాలికలు కిశోర వికాసం శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీలతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా గోష్టిలలో పాల్గొనాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రతినిధి దుర్గాప్రసాద్, ఏఎన్ఎం పరంజ్యోతి, ఎమ్మెస్కే పావని, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంగా ఎదగాలి

చాట్రాయి: కిశోర బాలికలు ఆరోగ్యకరంగా ఎదగాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని చాట్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. హెచ్‌వీ జాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. పోలవరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసు, సమతా అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సవరణ

Shriram Finance Ltd. ... [illegible]

Y. విజయకుమార్

చెత్త డంపింగ్‌ను అడ్డుకున్న స్థానికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చెత్త కొండపల్లి శ్రామిక నగర్ నివాసాల మధ్య క్వారీ గుంతలో డంపింగ్ చేసే ప్రయత్నాన్ని స్థానికులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాసరావు స్థానికులతో కలిసి అభ్యంతరం వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ విషయాన్ని కమిషనర్ రమ్యకీర్తన దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనాస్థలానికి చేరుకున్న కమిషనర్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి లారీలను వెనక్కు తిప్పి పంపారు. ఆగిన లారీలోని చెత్త దుర్వాసన వెదజల్లుతోందని ఇటువంటి చెత్త నివాసాల మధ్య ఎలా డంప్ చేస్తారని ప్రశ్నించారు.

చెత్త డంపింగ్ కాంట్రాక్టర్ టీడీపీ నేత?

గత ఆగస్టులో విజయవాడకు వచ్చిన వరద సమయంలో పోగుచేసిన చెత్తతో పాటు వివిధ వైద్యశాలల్లో సేకరించిన చెత్త సుమారు వెయ్యి టన్నులు కొండపల్లిలో డంపింగ్ చేసేందుకు నగరానికి చెందిన ఓ టీడీపీ నేత కాంట్రాక్ట్ దక్కించుకున్నట్లు తెలిసింది. స్థానిక అధికారుల అనుమతులు లేకుండా చెత్త డంపింగ్ చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు వెనక్కి పంపిన కమిషనర్ రమ్యకీర్తనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ సైన్యానికి మద్దతుగా ర్యాలీ

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను మట్టుపెడుతున్న భారత సైన్యానికి అందరూ అండగా నిలవాలంటూ చిల్లకల్లు పోలీసుల ఆధ్వర్యంలో షేర్‌మహ్మద్‌పేటలో శుక్రవారం సాయంత్రం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుపెడుతోందన్నారు. అనంతరం ఉగ్రవాదుల దాడుల్లో వీర మరణం పొందిన భారత సైనికులు, తెలుగు రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్, చిల్లకల్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్, అన్నిపార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామివారి కొండపై పందుల పెంపకం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని ప్రసిద్ధ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి కొండపై పందుల పెంపకం కేంద్రాలను ఏర్పాటు చేశారు. పందుల పెంపకం దారులు నిబంధనలకు విరుద్ధంగా శోభనాచలుడి కొండపై పందులు పెంచడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, స్వామివారి కొండపై ఇష్టానుసారంగా షెడ్లు వేసి పందులు పెంచుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి కొండపై ఏర్పాటు చేసిన పందుల పెంపకం కేంద్రాలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.